సరిహద్దుల్లో నిఘా పెంచాలి

● కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్


పోలీసులకు సూచనలిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్

హాలహర్వి: సరిహద్దుల్లో నిఘా పెంచాలని కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హాలహర్వి సమీపంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న క్షేత్రగుడి చెక్‌పోస్టును డీఐజీ పరిశీలించారు. సమస్యలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆయన వెంట పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ శ్రీనివాస్‌నాయక్, హాలహర్వి ఎస్ఐ చంద్ర ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఆలూరు: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజల మన్ననలు పొందాలని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ సూచించారు. మంగళవారం ఆలూరు పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని డీఐజీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీసులను ఆశ్రయించిన బాధితుల సమస్యలు తెలుసుకుని న్యాయం చేయాలని సూచించారు. డీఐజీ వెంట పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్, ఆలూరు, హాలహర్వి మండలాల ఎస్ఐలు నరసింహులు, చంద్ర తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ

దేవనకొండ: మండల కేంద్రం దేవనకొండ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన డీఐజీ పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ప్రజలకు పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. సీఐ విజయ్‌భాస్కర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన

తుగ్గలి: జాతీయ నేత్రదాన పక్షత్సోవాల్లో భాగంగా మంగళవారం తుగ్గలి పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి ప్రతిమ, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ.. నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. నేత్రదానంపై ఇప్పటికీ అవగాహన లేక చాలా మంది ముందుకు రావడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకుని బంధువులతో పాటు స్నేహితులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

కన్నయ్య శోభా యాత్ర


జొన్నగిరిలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

తుగ్గలి: త్రైతసిద్ధాంత ప్రబోధానంద సేవాసమితి-ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో జొన్నగిరిలో తొమ్మిది రోజులుగా సాగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. శ్రీకృష్ణుడి విగ్రహానికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పూల పల్లకీలో ఉంచి కన్నయ్య నామస్మరణతో వీధుల్లో ఊరేగించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేసి జీవాత్మ, పరమాత్మ, ఆత్మ అనే మూడు ధర్మాల స్థాపనపై సేవా సమితి సభ్యులు వివరించారు.

సక్రమంగా విధులు నిర్వహించండి


జెండా ఊపి వాహనాన్ని పంపుతున్న సర్పంచ్ సుహాసిని

మద్దికెర: పంచాయతీ సిబ్బంది విజయవాడలో వరద బాధితులకు మెరుగైన సేవలందించాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని సూచించారు. మంగళవారం స్థానిక పంచాయతీ సిబ్బంది విజయవాడకు వెళుతున్న సందర్భంగా సర్పంచ్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్యం పనులు, విద్యుత్‌పనులు చేపట్టడానికి పంచాయతీ సిబ్బందిని పంపుతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సభ్యులు లక్ష్మి నారాయణ ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తుగ్గలి: పల్లెలో విక్రయించడానికి తెచ్చిన కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. తుగ్గలి మండలం రామకొండ సమీపంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారన్న సమాచారంతో పత్తికొండ సెబ్ సీఐ స్వర్ణలత ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. గ్రామ సమీపంలో నిల్వ ఉంచిన 16 బాక్సుల ఒరిజినల్ చాయిస్ కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాగరాజు, అనిల్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ కార్తీక్, హెడ్ కానిస్టేబుల్ సర్దార్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

మద్దికెర: రైల్వే బ్రిడ్జిల్లో నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. సమస్యను పరిష్కరించాలని రైతులు రైల్వే డీఏఎం అప్పారావు, జేఈ అబ్దుల్, పీడబ్ల్యూ ప్రబోష్‌సింగ్‌లను కలిసి విన్నవించారు. మంగళవారం స్థానిక దర్గా వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా పంపింగ్ ద్వారా తొలగించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తుగ్గలి: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటనష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ తుగ్గలి, పత్తికొండ మండలాల అధ్యక్షులు జిట్టా నాగేష్‌యాదవ్, కారం నాగరాజు డిమాండ్ చేశారు. ఇప్పటికే రెండు మండలాల్లో వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురై రైతులు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. పత్తి, వేరుశనగ, సజ్జ, టమాట, మిరప, ఉల్లి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఆలస్యం కాకుండా నిబంధనలు సవరించి ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా పంట నష్టాలను నమోదు చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు టీడీపీ రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇంత వరకు అమలు కాలేదన్నారు. మరో నెలరోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ప్రభుత్వం ఇంత వరకు దాని ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో రైతు మునగాల గిడ్డయ్య సోమవారం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం ఏఓ సురేష్‌బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతి కారణాలపై ఆరా తీశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. నష్టపోయిన పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు.

నివాళి


లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డే నాగరాజు తల్లి వడ్డే లక్ష్మమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి గ్రామానికి చేరుకొని మృత దేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట సర్పంచ్ ప్రేమ్ కుమార్, ఎంపీటీసీలు సభ్యులు సుంకన్న, భీమలింగ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లతో వెట్టిచాకిరి

హొళగుంద: ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటోందని, వేతనాలు మాత్రం పెంచడం లేదని సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు వెంకటేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు సాలోమి విమర్శించారు. మంగళవారం ఆశా వర్కర్లతో కలిసి హొళగుంద ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. అనంతరం డాక్టర్ న్యూటన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు పనిభారాన్ని తగ్గించాలని, 60 సంవత్సరాలు దాటిన వారికి జీవోల ఇచ్చేవరకు రిటైర్మెంట్ చేయరాదన్నారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో భద్రత కల్పించి, రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు


సిబ్బందితో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి ఉమాదేవి

మద్దికెర: మండల అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం తుఫాను ప్రభావం వల్ల ఎక్కువగా వానలు కురుస్తున్నాయని.. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే నీరు సరఫరా చేసే ట్యాంకుల్లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. పాతశాలల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే ఉపాధి పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపాలన్నారు. పొదుపు మహిళలకు సకాలంలో రుణాలు అందజేయడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వర్ణలత, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, వైద్యాధికారిణి రాగిణి, ఎంఈఓ రంగస్వామి, ఏఓ రవి, ఏపీఓ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో యాజమాన్య పద్ధతులు అవసరం

కృష్ణగిరి: అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ, కంది, ఆముదం పత్తి, వరి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అధిక తేమ శాతం వల్ల పూత, కాయరాలడం, పంట పెరుగుదల కుంటుపడడంతోపాటు దిగుబడులు తగ్గి, పంట నాణ్యత లోపిస్తుందని తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరి పంట నాట్లు వేసి 20 నుంచి 40 రోజుల దశలో ఉందని, నీట మునిగిన పొలాలు త్వరగా పుంజుకోవడానికి, ఆశించే తెగుళ్ల నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజయాన్ని మాంకోజెబ్‌తో కలిసి పిచికారీ చేయాలన్నారు. అలాగే పత్తిలో నీరు నిలిచి ఉంటే ముందుగా వాటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండగా ఉన్న సమయంలో రెండు శాతం పోటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు.

కరుణించమ్మా.. మారెమ్మ

కృష్ణగిరి: మండలంలోని అమ్మవార్ల దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్లూరు గ్రామంలోని మారెమ్మ, ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే


మాట్లాడుతున్న సీఐ మధుసూదన్‌రావ్

వెల్దుర్తి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, విగ్రహాలను ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలని సీఐ మధుసూదన్‌రావ్, ఎస్ఐ అశోక్ అన్నారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులు, మతపెద్దలు, ఉత్సవాల నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. విగ్రహాలను ఏర్పాటు చేసేవారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సింగిల్‌విండో, ఆన్‌లైన్‌లో సైతం అనుమతులు పొందవచ్చని తెలిపారు. మండపాల వద్ద స్పీకర్లలో కేవలం భక్తి రంజక పాటలతో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి మంటపం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అన్నారు.

వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం


అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర: వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో ఇళ్ల ముందు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని.. తద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. అతిసారా, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో నిరుద్యోగులకు ఉపాధి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాధవి

ఆలూరు రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి కల్పిస్తున్నట్లు ఆలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జాబ్ మేళాకు 290 మంది యువతీ,యువకులు హాజరయ్యారని, 84 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలూరు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ వీరేష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి సాయితేజ, నాన్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసులు జూనియర్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బిల్లేకల్లు కూరగాయల మార్కెట్ వేలం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయలు మార్కెట్ వేలం బుధవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ బొందిమడుగుల శ్రీను తెలిపారు. రూ. లక్ష డిపాజిట్, రెండు లక్షల రూపాయలకు సాల్వెన్స్ సర్టిఫికెట్‌తో వేలంలో పాల్గొనాలన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

హొళగుంద: హొలగుంద మండలంలోని ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం కర్నూలులో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, డీపీఓ నాగరాజునాయుడుకు వినతి పత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశా, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, కోగిలతోట శేసప్ప, మల్లయ్య, అశోక్ తదితరులు సమస్యలను కలెక్టర్, డీపీఓకు వివరించారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా ఇద్దరు సెక్రటరీలు మాత్రమే ఉన్నారని, అదే విధంగా సచివాలయాల్లోనూ ఖాళీ పోస్టులు ఉన్నాయని చెప్పారు. దీంతో ప్రజలకు సేవలు సక్రమంగా అందడం లేదని, సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అదేవిధంగా మండల పరిధిలో ఇసుక రీచ్‌లు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నదులు, వాగు లు, వంకలో ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరామని నాయకులు తెలిపారు.

లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి

పత్తికొండ(తుగ్గలి): పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని పత్తికొండ ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి సూచించారు. మంగళవారం హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి, ఈఈ ప్రభాకర్‌తో కలిసి పట్టణ సమీపంలోని జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. బేస్‌లెవెల్ వరకు కట్టుకున్న వారు డిసెంబర్‌లోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకుంటే వెంటనే బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. అంతకు ముందు ఆర్డీఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఆలూరు, పత్తికొండ హౌసింగ్ డీఈలు ఆదినారాయణ, విజయ్ కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

పత్తికొండ(తుగ్గలి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రీసర్వే డీటీ లక్ష్మీకాంతరెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ రామలక్ష్మి, తహసీల్దార్, తోటి ఉద్యోగులు ఆయన్ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

పత్తికొండ(తుగ్గలి): వేతనాలు పెంచాలని కోరుతూ మంగళవారం జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీ వద్ద కార్మికులు ఆందోళన చేశారు. సుమారు వంద మంది కార్మికులు విధులకు వెళ్లకుండా పగిడిరాయి సమీపంలోని కంపెనీ గేటు బయట ధర్నా చేశారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపించారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

గూళ్యంలో 'పల్లెనిద్ర'


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులునాయక్

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో మంగళవారం రాత్రి సీఐ శ్రీనివాసులునాయక్, ఎస్ఐ చంద్రలు పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ.. గొడవలు పడకుండా అందరూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటికీ సంతృప్తి చెందకుంటే పోలీసులను ఆశ్రయించాలే తప్పా గొడవలకు పాల్పడవద్దని సూచించారు. పిల్లలను చదివించడంలో, పంటలు పండించడంలో పోటీ పడాలన్నారు.

టీబీ డ్యామ్‌లో వంద టీఎంసీల నిల్వ

● పెరుగుతున్న ఇన్‌ఫ్లో... ఎప్పుడైనా గేట్లు ఎత్తే అవకాశం


నిండుకుండల మారిన కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఎగువన ఉన్న తుంగా, భద్రా ప్రాజెక్టుల నుంచి వరద నీరు కొనసాగుతుంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఇన్‌ఫ్లో 30 వేల క్యూసెక్కులు ఉండగా 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం గల టీబీ డ్యామ్‌లో రాత్రికి 1632.5 అడుగుల వద్ద 100 టీఎంసీల నిల్వ అయ్యాయి. జలాశయం ఎగువన ఉన్న మలెనాడు, అగొంబె, వర్నాడు, తీర్థనల్లి, శివమొగ్గ, చిక్క మంగళూరు తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆ నీటితో పాటు ఎగువన ఉన్న తుంగా, భద్రా ప్రాజెక్టుల నుంచి దాదాపు 20 వేల క్యూసెక్కులు టీబీ డ్యామ్ వైపు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగితే బుధవారం ఉదయం క్రస్ట్ గేట్లు ఎత్తి 5 వేల క్యూసెక్కుల నుంచి ఎక్కువ మొత్తంలో నీటిని నదికి వదిలే అవకాశాలున్నాయని టీబీ బోర్డు అధికారులు విడుదల చేసిన హెచ్చరిక మేసెజ్‌లో తెలిపారు. డ్యామ్ నుంచి అవుట్ ఫ్లో రూపంలో పవర్‌కెనాల్(ఎల్లెల్సీ)కు 2,611, జిందాల్‌కు 60, ఎల్బీఎంసీకి 3,989, రాయబసవన్న కాలువకు 170 క్యూసెక్కులు, ఆర్‌ఓఎఫ్ఎస్ రైట్ 2,249, ఆర్ఓఎఫ్ లెఫ్ట్ ద్వార నదికి 2,500 క్యూసెక్కులు, ఆర్‌బీఎంసీ కాలువకు కలిపి మొత్తం 15,264 క్యూసుక్కులు బయటకు వెళ్తున్నాయి. ఇక జిల్లాకు సంబంధించి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) టీబీ బోర్డు సరిహద్దు ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 701 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయి.

సమన్వయంతో చవితి ఉత్సవాలు


ఉత్సవాల నిర్వహణపై మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

పత్తికొండ(తుగ్గలి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని ఆర్డీఓ ఎస్ రామలక్ష్మి అన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో వినాయక చవితి, నిమజ్జనాల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగ ప్రారంభం నాటి నుంచి నిమజ్జనం రోజు వరకు అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. పర్యావరణానికి హానికలగకుండా, శాంతి సంఘాల వారితో సమావేశాలు నిర్వహించి మట్టి విగ్రమాలు ప్రతిష్టించేలా అవగాహన కల్పించాలన్నారు. సింగిల్‌విండో విధానంలో విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అన్నారు. బాణాసంచా నియంత్రించి అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నిమజ్జనం సజావుగా సాగేలా చూడాలన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, సీఐలు జయన్న, పులిశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్ ఖాన్, విద్యుత్తుశాఖ డీఈ ఖాజావలి, ఏఈలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లి, బిడ్డ ఆరోగ్యం


మాట్లాడుతున్న సీడీపీఓ ల్యాక్

వెల్దుర్తి: సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడం బాలింతలు, గర్భిణులు, శిశువులకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ ల్యాక్ అన్నారు. పౌష్టికాహార మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిత్యావసర సరుకులతో చేసిన ఆకృతులు ఆకట్టుకున్నాయి. సీడీపీఓ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన శిశువు జననం తల్లి తీసుకునే పౌష్టికాహారంతోనే సాధ్యమన్నారు. గర్భిణులు తీసుకునే పౌష్టికాహారంతో కాన్పుల మరణాలు అరికట్టవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా భుజించాలని, ఇళ్లల్లో సైతం బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈదమ్మ, సరస్వతి, మాబున్ని, రామలక్ష్మమ్మ, పార్వతి, జ్యోతి, మహేశ్వరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కు అందజేత


చెక్కులను అందజేస్తున్న శ్రీనివాసులు

దేవనకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ(పీఏసీఎస్)లో సభ్యులైన నేలతలమరి గ్రామానికి చందప్ప, చెల్లిచెలిమల గ్రామానికి చెందిన రంగస్వామి కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. పీఏసీఎస్ జీవిత బీమా సభ్యత్వం కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చెక్‌ను వారి కుటుంబ సభ్యులకు మంగళవారం కేడీసీసీ చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రహంతుల్లా, విజయ్‌భాస్కర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి

ఆస్పరి: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆస్పరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 సంవత్సరానికి ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సదర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామాలలో జరిగే ఉపాధి పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తామన్నారు. నిధులు దుర్వినియోగం చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలన్నారు. 2023-24 సంవత్సరానికి రూ. 12.86 కోట్లుకు సామాజికి తనిఖీ చేయగా రూ. 58,779 రికవరీ చేయగా, రూ. 40వేలు ఫైన్ వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకుర ఉమాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, అడిషనల్ పీడీ మాధవీలత, డీపీఓ భాస్కర్, ఏపీడీ పద్మావతి, ఏపీఓ కళ్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భారతి

పత్తికొండ(తుగ్గలి): కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎంఎస్ భారతి అన్నారు. మంగళవారం పత్తికొండ కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార కార్యాలయంలో ఆమె మట్లాడారు. ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షి దారులు పాల్గొని కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సమయంతో పాటు డబ్బులు సైతం ఆదా అవుతాయన్నారు. న్యాయవాదులు కూడా కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధరలు తగ్గించాలి


ఆస్పరిలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఆస్పరి: పెట్రోల్, డిజిల్, వంట గ్యాస్‌తోపాటు నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి నిత్యావసర సరుకుల ధరలు పెరగడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్రిష్ణమూర్తి, బ్రహ్మయ్య, హనుమంతు, కృష్ణ, నల్లన్న హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవి

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించి అప్రమత్తం చేయాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి తెలిపారు. మంగళవారం స్థానిక మొలగవల్లి పీహెచ్‌సీలో ఆయన వైద్యారోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ఏఎన్ఎంలు, ఆశాలు వారి పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. రోజు విడిచి రోజు జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్ఓ అంద్రూస్, సూపర్‌వైజర్ బాషా తెలిపారు.